# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### కాంగ్రెస్ హయాంలో ఇబ్బందులు

**- హన్మంత్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి, మద్దూర్**

ధరణి వచ్చిన తర్వాతే రైతుల జీవితాలు కుదుటపడ్డాయి. తమ భూములకు వచ్చిన ఢోకా ఏమీ లేదని గుండెపై చేయి వేసుకొని హాయిగా నిద్రపోగలుగుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారి కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్‌కు రూపకల్పన చేయడం రైతులకు వరంగా మారింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల నిర్వహణ అధికారుల చేతుల నుంచి తీసివేయడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. రైతులు వచ్చి వేలి ముద్ర వేస్తే గాని భూమి పట్టా మార్పిడి జరగని పరిస్థితి తీసుకువచ్చిన కేసీఆర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ధరణి పోర్టల్ ద్వారా రైతు బంధు, రైతు బీమా, పంట కొనుగోళ్లు వంటి ఇతర ప్రయోజనాలు కూడా రైతులకు కలిసివచ్చాయి. కాంగ్రెస్ హయాంలో అధికారులతో ఇబ్బందులు వచ్చేవి. డబ్బులిస్తే ఒకరి భూమి మరొకరి పేరుపై మార్చేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి తీసుకువచ్చిన భూములకు భద్రత కల్పించారు. కాంగ్రెస్ వచ్చేదుందా.. సచ్చేదుందా.. మా మద్దతు బీఆర్‌ఎస్‌కే..



### ధరణి ఎత్తేస్తే బాధలే..

**- బాల్‌రెడ్డి, కొత్తూరు, బొంరాస్‌పేట**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. తాము అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తేస్తామని చెప్పడం విచారకరం. రైతులకు మంచి చేసే ఏ పనులను కూడా కాంగ్రెస్ పార్టీ ఇష్టపడడంలేదు. పాతకాలం నాటి పట్వారీ వ్యవస్థను తెచ్చి రైతులను పీడించాలని చూస్తున్నారు. ధరణితో మండల కేంద్రాల్లోనే క్షణాల్లో భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. భూములకు రక్షణ కూడా ఉంది. ధరణిని ఎత్తేస్తామంటున్న కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. అందుకే మేం బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం.



### కాంగ్రెసోళ్లను నమ్మొద్దు

**- రాములు, రైతు, పర్సాపూర్, కొడంగల్**

కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే.. పొంతన లేని మాటలతో రైతులను ఇబ్బంది పెట్టేవిధంగా ప్రవర్తిస్తున్నారు. ధరణితో రైతులందరం ఎంతో నమ్మకంతో ఉన్నాం. మళ్లీ కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తే భూముల గతి మళ్లీ మొదటికి వస్తుంది. ఈ రోజుల్లో ఏ చీకూచింత లేకుండా భూమి పదిలంగా ఉందని భావిస్తూ.. సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. ధరణి పోతే భూములు ఎవరి పాలయ్యేదో తెలియదు. అధికారంలోకి రాకముందే కాంగ్రెస్ ఈ విధంగా ప్రవర్తిస్తే అధికారాన్ని కట్టేబడితే ఇంకే ప్రమాదాలను తెస్తుందో. కాంగ్రెస్ వచ్చేదిలేదు.. సచ్చేదిలేదు.. అందుకే బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలి. భూముల వివరాలు అప్పట్లో కాగితాలపై ఉండి, ఎప్పుడు కిందికి మీదికి అయ్యేవో తెలియని పరిస్థితి. ధరణి వచ్చిన నాటి నుంచి భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఆధార్ లింక్‌తో మా భూములు పదిలంగా ఉన్నాయి. ఎవరు ఏం చేయాలన్నా వీలు పడదు. రిజిస్ట్రేషన్ చేస్తే రైతు వేలుముద్ర తప్పనిసరి కావడంతో ధరణితో ఎంతో భరోసా ఏర్పడింది. మళ్లీ సీఎం కేసీఆర్ సార్ ఉంటేనే రైతులు బాగుపడతారు.



### ధరణి లేకుంటే భూములు ఆగమే..

**- మల్లప్ప, రైతు, దౌల్తాబాద్**

ధరణి లేకుంటే భూములు ఆగం కాక తప్పదు. ధరణి లేనప్పుడు భూముల పరిస్థితి ఏవిధంగా ఉండేదో అందరికీ తెలుసు. భూములకు సంబంధించి ఏ చిన్న పని చేసుకోవాలన్న తహసీల్ ఆఫీస్ ముందు పడిగాపులు కాయాల్సి వచ్చేది. అధికారుల చుట్టూ తిరగలేక, చేతులు తడపలేక నానా తంటాలు పడ్డాం. కాంగ్రెస్ మళ్లీ పాతరోజులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. వీఆర్వో, పటేల్, పట్వారీల వ్యవస్థ వస్తే భూములపై ఆశలు వదులుకోవాల్సిందే. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే భూములు పోయినట్టే.. అందుకే కాంగ్రెస్‌ను బొందపెట్టాలే.. బీఆర్‌ఎస్ పార్టీ వెంటే ఉంటే రైతులకు బాగుంటుంది. కేసీఆర్ సార్ వచ్చిన నాటి నుంచే రైతులం సంతోషంగా ఉన్నాం.



### పైరవీకారుల రాజ్యం సాగుతది

**- కృష్ణారెడ్డి, టేకులపల్లి, మోమిన్‌పేట**

ధరణితో భూములు భద్రంగా ఉంటున్నాయి. భూ రిజిస్ట్రేషన్లు త్వరగా అవుతున్నాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ధరణిని తీసేస్తే తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ పైరవీకారులు రాజ్యమేలుతారు. పైరవీకారుల చేతుల్లోనే పనులన్నీ. వారిని ఆశ్రయించకపోతే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తది. భూముల గొడవలు జరుగుతాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించే అవకాశముంది. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలి. అందుకే మేమంతా బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం.




## ధరణి జోలికొస్తే..

# తరిమికొడతాం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. రైతులు వ్యవసాయ భూములు అమ్మాలన్నా, కొనాలన్నా పైరవీకారులు, దళారులను ఆశ్రయించాల్సిన అవసరంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకునే పరిస్థితి కూడా లేదు. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే చాలు 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అప్పటికప్పుడు మ్యుటేషన్ కాపీని కూడా రైతుకు అందిస్తున్నారు. గతంలో రిజిస్ట్రేషన్ కావాలంటే రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముడుపులు సమర్పించినా పని మాత్రం అయ్యేది కాదు. దీంతో రైతులు విసిగి వేసారి ఇబ్బందులు పడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా తహసీల్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధరణిలో ఏ సమస్య వచ్చినా ఇట్టే పరిష్కారమయ్యేలా చూసుకుంటున్నారు. రైతుల భూములకు ఎసరు పెట్టేందుకు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూ మాతను తీసుకువస్తామంటున్నదని జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. దళారీ వ్యవస్థను ప్రోత్సహించేందుకు కాం గ్రెస్ చూపిస్తున్న అత్యుత్సాహంపై రైతులు మండిపడుతున్నారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు రైతులంతా ఒక్కటవుతున్నారు. పకడ్బందీగా ధరణిని అమలు చేసి రైతులకు మేలు చేస్తున్న బీఆర్‌ఎస్ వెంటే ఉంటామని స్పష్టం చేస్తున్నారు.

- ‘భూమాత’ వస్తే రైతు బతుకు భారమే..
- ధరణితో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్
- ధరణిని తీసేస్తే ఆగమవుతామంటున్న రైతులు
- కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఏకం
- ఆదుకుంటున్న ప్రభుత్వానికే మద్దతంటున్న అన్నదాతలు



### మ్యుటేషన్ కావాలంటే లంచమివ్వాల్సిందే..

**- పరమేశ్, రైతు, చిలాపూర్, పూడూరు**

ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత వ్యవస్థ వస్తుంది. బ్రోకర్లు పుట్టుకొస్తారు. రిజిస్ట్రేషన్ అనంతరం మ్యుటేషన్ కోసం ఇక చెప్పులరిగేలా తిరగాల్సిందే. ఇప్పుడున్న ధరణితో సమస్యలు తొలగిపోతున్నాయి. ఎమ్మార్వో ఆఫీసులోనే పట్టాతోపాటే వెంటనే మ్యుటేషన్ చేసి ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను ఆగం చేస్తారు. అయినా కాంగ్రెస్ వచ్చేదుందా.. సచ్చేదుందా.. ఈ ఎన్నికల్లో కేసీఆర్ సారుకే రైతుల మద్దతు.



### కాంగ్రెస్‌వి కల్లబొల్లి మాటలు

**- డీవై ప్రసాద్, పెద్దేముల్**

సీఎం కేసీఆర్ భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ఇప్పుడేమో కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాగానే మేము ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూమాత అనే పేరుతో పోర్టల్‌ను తీసుకొస్తామని ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలను ఎవరూ నమ్మరు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరో 60 ఏండ్లు వెనక్కి పోతాం. కాంగ్రెస్‌ను తరిమికొడదాం. బీఆర్‌ఎస్‌ను అక్కున చేర్చుకుందాం.

### కాంగ్రెస్ పాలసీ భూ‘మేతే’..

**- చందర్‌నాయక్, బషీర్‌మియాతండా, యాలాల**



కాంగ్రెస్ ఎప్పుడైనా రైతులను పట్టించుకుందా? అప్పుడు చేయలేనివారు ఇప్పుడు చేస్తారా? అన్నదాతలను ఆదుకుంటామని కాకమ్మ కథలు చెపుతున్నది. కాంగ్రెస్ పాలసీ భూ‘మేతే’. దీంతో దళారుల రాజ్యం మొదలవుతుంది. రైతులు అష్టకష్టాలు పడుతారు. దీన్ని నివారించాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకట్ట వేయాల్సిందే. కాంగ్రెసోళ్లు ఆడుతున్న డ్రామాలు ప్రతిఒక్కరికీ అర్థమవుతున్నాయి. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. అందుకే మేం బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం. సీఎం కేసీఆర్ సారే మళ్లీ అధికారంలోకి వస్తారు.

### ధరణి రద్దు తెలివితక్కువ పని

**- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, బడెంపల్లి, దోమ**



గత ప్రభుత్వాలు రెవెన్యూ వ్యవస్థను ఆధునీకరించకపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. రైతుల అవస్థలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ధరణి పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చింది. అది ఓర్వలేని నాయకులు ఎన్నికల సందర్భంగా అధికార దాహమే లక్ష్యంగా ఆలోచించి.. తాము అధికారంలోకి వస్తే ధరణి వ్యవస్థను రద్దు చేస్తాం.. పాత రెవెన్యూ విధానాన్ని తీసుకువస్తామనడం తెలివితక్కువ పనే అవుతుంది. వ్యవసాయంపై అవగహన లేని నాయకుల మాటలను రైతులు తిప్పికొట్టాలి. మేమంతా బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం.

### చేతులు తడపాల్సిందే..

**- రాచయ్య, దామస్తాపూర్, మర్పల్లి**



బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో భూ రిజిస్ట్రేషన్ త్వరగా జరిగిపోతున్నది. వెంటనే పాసు బుక్కులలో పేరు నమోదు అవుతున్నది. వారం, 10 రోజుల్లోనే పట్టా పాసుబుక్కులు ఇంటికి వస్తున్నాయి. రైతు బంధు, రుణమాఫీ తదితర సౌకర్యాలను పొందుతున్నాం. కాంగ్రెస్ హయాంలో ధరణి లేనప్పుడు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే నెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు చేతులు తడపందే ఫైల్ ముందుకు కదిలేదికాదు. అందుకే కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వం. మేము బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తాం.